సాక్షి
ఖమ్మం

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



స్థితిగతులు, అభివృద్ధిపై ఆరా

కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు చెందిన అధికారులు శిక్షణలో భాగంగా గ్రామాల్లో ప్రజల స్థితిగతులు, అభివృద్ధిపై అధ్యయనం చేస్తున్నారు. 8లో



ప్రమాదాలకు నిలయం..

కొణిజర్ల మండలంలోని బోడియా తండా వద్ద సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారింది. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సదరమ్ సర్టిఫికెట్‌కు 53 మంది అర్హత

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన క్యాంపులో 53మంది దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. మొత్తం 168 మంది స్లాట్‌బుక్ చేసుకోగా 127 మంది క్యాంపునకు హాజరయ్యారు. వీరిని పరీక్షించిన వివిధ విభాగాల వైద్యులు 53మందిని సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

అయోడిన్ లోపం రుగ్మతలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రామారావు

రఘునాథపాలెం: అయోడిన్‌లోపంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, రుగ్మతలను అరికట్టేలా పాఠశాలల్లో అవగాహన కల్పించాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ డి.రామారావు సూచించారు. మండలంలోని వీ.వీ.పాలెం పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. అయోడిన్ లోపం లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ధాన్యం కట్టడికి చెక్‌పోస్ట్



చెక్‌పోస్ట్‌లో పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: రాష్ట్రంలో సన్న రకం వరి సాగు చేసిన రైతులకు క్వింటాకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా కట్టడి చేసేందుకు అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగానే బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపాన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టును సివిల్ సప్లయిస్ అధికారులు రాంచందర్‌రావు, సత్యనారాయణ, కిరణ్ పరిశీలించి సరిహద్దుగా ఉన్న ఏపీ నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. తహసీల్దార్ పున్నంచందర్, ఎస్‌ఐ మధుబాబు, ఆర్‌ఐ లక్ష్మణ్, ఏఈఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫార్మసీ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈమేరకు ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకున్న 395 మందిలో 380మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ జకీరుల్లా తెలిపారు.

నష్టపరిహారం అందలేదని ఏఓ నిలదీత



బోనకల్‌లో ఏఓను నిలదీస్తున్న రైతులు

బోనకల్: మండలంలోని రాపల్లిలో అర్హులైన రైతులకు పంట నష్టపరిహారం అందలేదని పలువురు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరావును మంగళవారం నిలదీశారు. తుపాన్‌తో తమ పొలాలు దెబ్బతిన్నా వివరాలు నమోదు చేయకపోవడంతో పరిహారం అందలేదని ఆరోపించారు. ఇదే సమయాన పంటలు వేయని వారికి పరిహారం ఎలా చెల్లించాలని ప్రశ్నించారు. దీంతో ఏఓ వారికి జాబితా అందజేశారు. రైతులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నాగయ్య, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లో పంట నష్టపరిహారం విషయమై తప్పిదాలకు పాల్పడిన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో బోనకల్ మండలంలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం దక్కకపోగా, సాగు చేయని వారికి, భూమి లేని వారికి నేతల ప్రోద్బలంతో పరిహారం చెల్లించారని ఆరోపించారు.

సుడా నీకా, నాకా?!

ఖమ్మంలోని సుడా కార్యాలయం



చైర్మన్ గిరీ కోసం ఆశావహుల పట్టు

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల ఒకరికి.. ఎంపీ రేణుక మరొకరికి అభయం
- మంత్రి పొంగులేటి నిర్ణయంపై శ్రేణుల్లో చర్చ
- నేరుగా సీఎంను కలుస్తున్న మరికొందరు నేతలు
- జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారిన 'స్తంభాద్రి' రాజకీయం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో సత్తుపల్లి మినహా నాలుగు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న సుడా(స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ గిరీ కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.రాజకీయంగా, ఆర్థికంగా ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పదవి కావడంతో అంతా ఆసక్తిగా ఉన్నారు. ఓ నేతకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మరో నేతకు ఎంపీ రేణుకాచౌదరి ఆశీస్సులు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదే సమయాన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎవరిని ప్రతిపాదిస్తారు.. ఆయన మద్దతు ఎవరికి ఉంటుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో కొనసాగుతోంది. ఎవరికి వారు తమ ఆశీస్సులు ఉన్న నేతకే పదవి దక్కేలా పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకొందరు ఆశావహులు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి సుడా చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతుండడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

పువ్వాళ్ల వర్సెస్ ఆశావహులు

డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సుడా చైర్మన్ రేసులో ఉన్నట్లు సమాచారం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం శ్రేణులను ముందుండి నడిపించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టు వస్తుందని ఊహించినా నిరాశ ఎదురైంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఐదుగురికి నామినేటెడ్ పోస్టులు దక్కగా, ఇంకా ఒకటి లేదా రెండు పోస్టులు దక్కొచ్చనే ప్రచారం సాగుతోంది. ఇంతలోనే దుర్గాప్రసాద్‌కు సుడా చైర్మన్ పదవి కట్టబెడతారన్న ప్రచారం మొదలైంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రి తుమ్మల ఆశీస్సులతోనే ఆయన పీఠంపై కూర్చుంటారని చెబుతున్నారు. ఆయనతో పాటు సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, చావా నారాయణ, వడ్డెబోయిన నర్సింహారావు కూడా సుడా చైర్మన్ బరిలో ఉన్నారు. రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వీరు.. ఆ పదవి రాకపోతే సుడాను వదులుకోవద్దనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదీ సుడా నేపథ్యం..

సుడా(స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) 2017 అక్టోబర్ 24న ఏర్పాటైంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, వైరా మున్సిపాలిటీతోపాటు ఖమ్మంరూరల్, కూసుమంచి, ముదిగొండ, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లోని 46 గ్రామపంచాయతీలు ఈ పరిధిలో ఉండగా.. మొత్తం వైశాల్యం 573 చదరపు కి.మీ.గా ఉంది. ఈ పరిధిలో వెంచర్లకు అనుమతుల జారీ, అభివృద్ధి, నిర్మాణాలకు నిధుల కేటాయింపు, పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టే సుడాకు రెండేళ్ల పదవీకాలంతో మొదటిసారిగా 2020 జూన్‌లో పాలకవర్గాన్ని అప్పటి ప్రభుత్వం నియమించింది. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ పాలకవర్గాన్ని రద్దు చేసింది.

పట్టుకోసం రేణుకాచౌదరి

రాజ్యసభ సభ్యురాలైన రేణుకాచౌదరి జిల్లాలో తన పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులు ఆమె అనుచరులెవరికీ దక్కలేదు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్‌కు సుడా చైర్మన్ పదవి ఇవ్వాలని ఎంపీ ప్రతిపాదించినట్లు తెలిసింది. గతంలో ఆయన ఖమ్మం ఎమ్మెల్యే టికెట్ ఆశించిన నేపథ్యాన సుడా పీఠంపై కూర్చోబెట్టాలని ఎంపీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఈ విషయాన్ని ఆమె ప్రస్తావించినట్లు తెలిసింది.

పొంగులేటి ఎటువైపు..

రాష్ట్ర మంత్రి పొంగులేటి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గం కూడా సుడా పరిధిలో ఉంది. దీంతో చైర్మన్ పదవికి ఎవరిని ఎంపిక చేసినా డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రులఏకాభిప్రాయం తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో సుడా చైర్మన్‌గా మంత్రి పొంగులేటి ఎవరినైనా ప్రతిపాదిస్తారా, ఆయన నిర్ణయం ఎలా ఉంటుందనే అంశంపైఅనుచరుల్లో చర్చ కొనసాగుతోంది. పొంగులేటి అనుచరులు కొందరు ఈ పదవిపై ఆశలు పెట్టుకున్న నేపథ్యాన డిప్యూటీ సీఎం, మంత్రి తుమ్మలతో పొంగులేటి కలిసి వెళ్తారా, తన అనుచరుల కోసం పావులు కదుపుతారా అన్నది తేలాల్సి ఉంది. ఈ నేపథ్యాన సుడా చైర్మన్ పదవిపై పీటముడి నెలకొనగా.. కాంగ్రెస్‌లో వేడి పుట్టిస్తోంది.

25న ఉమ్మడి జిల్లాలో గవర్నర్ పర్యటన

- 24న రాత్రి సారపాకలో బస చేయనున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- మరుసటి రోజు రామయ్య దర్శనం, రెండు జిల్లాల్లో భేటీలు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 25న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం విడుదల చేశాయి. సూర్యాపేట జిల్లా నుంచి ఈనెల 24న సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోకి ఐటీసీ గెస్ట్‌హౌజ్‌కు ఆయన చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.

25న గవర్నర్ షెడ్యూల్ ఇలా..

- ఉదయం 8.10 గంటలకు భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామిని గవర్నర్ దర్శించుకుంటారు.
- ఉదయం 9 గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమవుతారు.
- అనంతరం 11 గంటల వరకు ఎంపిక చేసిన 25మంది ప్రముఖ రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో భేటీ అయి మాట్లాడుతారు.
- అక్కడినుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు గవర్నర్ చేరుకుంటారు.
- మధ్యాహ్నం 1.55 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకుని సాయంత్రం 3గంటల వరకు జిల్లా అధికారులతో మాట్లాడతారు.
- ఆతర్వాత గంట పాటు ఎంపిక చేసిన 25మంది ప్రముఖ రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలతో భేటీ అయ్యాక హైదరాబాద్ బయలుదేరతారు.

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు చేయండి

ఖమ్మం సహకారనగర్: ఈనెల 25న జిల్లా పర్యటనకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్న నేపథ్యాన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు బుధవారం మధ్యాహ్నంలోగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేలకొరుగుతున్న వరి పైరు



చిరుపొట్ట దశలో ఉన్న వరి పంట నేలవాలుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో దాదాపు ప్రతిరోజు సాయంత్రమైందంటే ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో కల్లూరు మండలంలోని రఘునాథగూడెం, రఘునాథ బంజరు, చంద్రుపట్ల తదితర గ్రామాల్లో వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పొట్ట దశలో ఉన్న వరికి సుంకు పోసుకునే అవకాశం తగ్గిపోయి తాలు గింజలు ఏర్పడుతాయని.. తద్వారా దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక కల్లూరు మండలంలోనే సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి నేలకు ఒరిగినట్లు తెలుస్తుండగా జిల్లాలోని ఇంకొన్ని ప్రాంతాల్లో సైతం ఇదే పరిస్థితి ఎదురైనట్లు సమాచారం.

– కల్లూరురూరల్

ఒకే అవకాశం.. ఆతర్వాత జైలుకే..

అవగాహన సదస్సులో సీపీ సునీల్‌దత్



సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ సునీల్‌దత్

సత్తుపల్లి: యువత గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండకపోతే విలువైన భవిష్యత్ కోల్పోతారని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. మొదటిసారి పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తామని, రెండోసారి కూడా పట్టుబడితే జైలుకు వెళ్లకతప్పదని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై సత్తుపల్లిలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు అధ్యక్షతన జరిగిన సదస్సులో సీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులు సైతం పిల్లలు సరిగా నిద్రపోతున్నారా, కళాశాలకు సక్రమంగా వెళ్తున్నారా, స్నేహితుల్లో ఎవరైనా అనుమానితులు ఉన్నారా అనేది పరిశీలించాలని సూచించారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మాదకద్రవ్యాలకు అలవాటైతే ఉద్యోగాలు రావని, పెళ్లిళ్లు కావని తెలిపారు. కొందరు గంజాయి లావాదేవీల్లో వచ్చే డబ్బును మావోయిస్టులకు చేరవేస్తున్నట్లు భావిస్తున్నామని తెలిపారు. గంజాయి సేవించేవారితో పాటు విక్రయించే వారు నూరు శాతం పోలీసుల నిఘాలో ఉంటారని స్పష్టం చేశారు. సత్తుపల్లి ఏపీ సరిహద్దుగా ఉండటంతో అక్కడి నుంచి వస్తున్న కొందరు చోరీలకు పాల్పడుతున్నట్లు తేలడంతో సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టం చేసేలా వ్యాపారుల సహకారం తీసుకుంటామని సీపీ వెల్లడించారు. అనంతరం సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించిన సీపీ ఆవరణలో మొక్కలు నాటారు. సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు టి.కిరణ్, ముత్తిలింగం, ఎస్సైలు వీరప్రసాద్, నాగరాజు, వెంకటేష్, షాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

లేని మొక్కలకు నీళ్లు.. ఉద్యోగులకు కూలీ!

- ఉపాధి హామీ పథకంలో అడ్డగోలు దోపిడీ
- బర్లగూడెం సామాజిక తనిఖీలో బయటపడిన సిబ్బంది అక్రమాలు

కామేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించేలా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని సిబ్బంది అబాసుపాలు చేస్తున్నారు. తమకు మాత్రమే తెలిసిన లొసుగుల ఆధారంగా ఫీల్డ్ అసిసెంట్లు, మేట్లు, ఇతర సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే, నిధులు పక్కదారి పడుతున్నట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడవుతున్నా చర్యలు అంతంత మాత్రంగా ఉండడంతో అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బతికి లేని మొక్కలకు నీళ్లు పోసినట్లు.. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, మంచం పట్టిన వృద్ధులు, చనిపోయిన వారి పేరిట మస్టర్లు(హాజరు) నమోదు చేసి జేబులు నింపుకుంటున్నట్లు తెలుస్తోంది. కామేపల్లి మండలం బర్లగూడెంలో స్వతంత్ర పరిశీలకుడు వెంకట్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అనేక అవకతవకలు బయటపడ్డాయి. కాగా, ఎస్‌ఆర్‌పీ సాంబశివచారి, డీఆర్పీలు మహేష్, రాఘవేంద్ర గుర్తించిన అంశాలను సమర్పించారు.

అక్రమాల్లో కొన్ని..

పనిచేయని వారి పేరిట మస్టర్ నమోదు చేయడం, కూలీల సంతకాలు లేకుండానే నగదు చెల్లించడం, చేసిన పని కంటే అదనంగా చెల్లించడం వంటి అక్రమాలు జరిగాయని తనిఖీల్లో గుర్తించారు. కుంటల్లో పూడికతీత గతంలోనే చేసినా మళ్లీ పనులు చేపట్టి.. కూలీలకు రూ.29.89లక్షలకు పైగా చెల్లించినట్లు నమోదు చేశారు. ఇక గ్రామంలో 1,493 మొక్కలు నాటగా 916 మొక్కలే బతికి ఉన్నా అన్నింటికీ నీళ్లు పట్టించామని, వాచర్‌కు రూ.1,29,397 చెల్లించినట్లు పొందుపరిచారు. నర్సరీలో 17వేల మొక్కలను పెంచినట్లు చెబుతున్నా అందులో 16,188 మొక్కల వివరాలు నమోదుచేయలేదు. అయినా మొక్కల పెంపకానికి రూ.65,585 చెల్లించారు. ఇక 2019లో మృతి చెందిన భూక్యా రత్న 2023 ఆగస్టులో రెండు వారాలు పనిచేసినట్లు హాజరు వేసి నగదు చెల్లించినట్లు నమోదు చేయడం గమనార్హం. అంతేకాక పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భూక్యా చంద్రశేఖర్, ప్రభుత్వ ఉద్యోగి బానోత్ సుధాకర్, రిటైర్డ్ ఉద్యోగులు, మల్టీపర్పస్ వర్కర్లు సైతం పనిచేసినట్లు నమోదు చేశారని తనిఖీ బృందాలు గుర్తించాయి. కేవలం బర్లగూడెంలోనే రూ.లక్షల్లో ఫీల్డ్‌అసిసెంట్లు, సీనియర్ మేట్లు, సిబ్బంది దుర్వినియోగం చేసినట్లు తేలగా.. మండలంలోని ఇతర గ్రామాల్లో పరిస్థితి తేలాల్సి ఉంది.

మున్నేటికి ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణం

- ముురుగు, వరదనీరు సాగేలా నిర్మాణానికి కసరత్తు
- రెండువైపులా జలవనరుల శాఖ ఆధ్వర్యాన సర్వే



మున్నేటి బ్రిడ్జి వద్ద సర్వే చేస్తున్న ఇంజనీర్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో ప్రవహిస్తున్న మున్నేటికి వరద పెరిగినప్పుడు ఆ ప్రభావం పరీవాహక ప్రాంతాలపై పడకుండా ప్రభుత్వం రూ.690 కోట్ల వ్యయంతో ఇరువైపులా 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇదే సమయాన ఇరువైపులా కాలనీల్లో నుంచి వచ్చే వరదతోపాటు మురుగునీరు మున్నేటిలో కలిసేలా డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే కాలనీ నుంచి నీరు మున్నేటిలోకి వచ్చే మార్గం ఉండదు. దీంతో ప్రత్యేకంగా డ్రెయిన్ల నిర్మాణానికి నిర్ణయించిన అధికారులు సర్వే మొదలుపెట్టారు. ఖమ్మం నియోజకవర్గంలోని ఐదు పెద్దవాగులు, ఆరు చిన్న కాల్వల ద్వారా వచ్చే నీరు ప్రకాష్‌నగర్ వద్ద మున్నేటిలో కలిసేలా ఈ డ్రెయిన్ నిర్మిస్తారు. మరోపక్క పాలేరు నియోజకవర్గం పరిధిలోనూ వాగులు, కాల్వల ద్వారా వచ్చే నీటిని డ్రెయిన్‌లోకి మళ్లించి ప్రకాష్‌నగర్ వద్దే మున్నేటిలో కలుపుతారు. ఈ మేరకు జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్, ఈఈలు అనన్య, మంగళపుడి వెంకటేశ్వర్లు, డీఈలు ఉదయ్‌ప్రతాప్, రమేష్‌రెడ్డి, ఏఈలు కొద్దిరోజులుగా సర్వే చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిచేసి ప్రభుత్వానికి అంచనాలు పంపనున్నట్లు తెలిసింది.

పకడ్బందీగా పథకాల అమలు

- ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చేసినా, అవినీతికి పాల్పడినా ఉపేక్షించం
- ఆ కాంట్రాక్టర్లపై నివేదిక ఇవ్వండి
- 'దిశ' కమిటీ సమావేశంలో చైర్మన్, ఎంపీ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్, సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్‌శ్రేష్ట

ఖమ్మం సహకారనగర్: కేంద్రప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలుచేస్తూ అర్హులైన వారికి లబ్ధి జరిగేలా యంత్రాంగం పనిచేయాలని దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాబోయే మూడు నెలల లక్ష్యాలను శాఖల వారీగా అధికారులు వివరించారు.

పరిశ్రమలకు ప్రోత్సాహం

జిల్లాలో అపారమైన వనరులు ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు అవకాశముందని ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తూ పథకాలు వర్తింపచేయాలని తెలిపారు. అలాగే, అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ ఆధారిత వాహనాలు అందించేలా క్యాంపులు ఏర్పాటుచేయాలన్నారు. కాగా, సత్తుపల్లి ఎమ్మెల్యే ఫిర్యాదు ఆధారంగా అక్కడ పాఠశాల హెచ్‌ఎంపై ఇతర మండలాల అధికారులతో విచారణ జరిపించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సత్తుపల్లిలో ఆస్పత్రి, జాతీయ రహదారుల పనులు సకాలంలో జరగకపోతే కాంట్రాక్టర్లపై నివేదిక సమర్పించాలన్నారు. అటవీ ప్రాంతంలో లభ్యత ఉన్న ఇసుకను సొంత అవసరాలకు ప్రజలు వాడుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి అనుమతించాలని తెలిపారు. ఇక కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు ఎంపీ సూచించారు.. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ట, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, పక్కన వైరా ఎమ్మెల్యే రాందాస్

ఇంకా ఎవరేం అన్నారంటే...

- **కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ** అంగన్‌వాడీ నూతన భవనాలు, మరమ్మతుల వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. జిల్లాలోని ఐదు మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా చిన్నారి కార్యక్రమం, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో డ్రగ్స్ వినియోగం అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశమున్నందున ఔత్సాహికులను ప్రోత్సహిస్తామని, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా చూస్తామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తిస్తున్నామని చెప్పారు.
- **సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ** పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు, రుణాలపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల నాణ్యతను తనిఖీ చేయాలని, పాలు, నూనె పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. తమ నియోజకవర్గంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎంకు అనుకూలంగా నివేదిక రూపొందించి పాత పాఠశాలలోనే పోస్టింగ్ ఇవ్వడం, ఫిర్యాదు చేసిన తన అభిప్రాయం తీసుకోకపోవడాన్ని ఆమె ప్రస్తావించారు. అలాగే, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్‌కు ఇతర పనులు అప్పగించడంపై ప్రశ్నించారు.
- **వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ** త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నందున ఇసుక తరలింపునకు అవకాశం కల్పించాలని సూచించారు. ఖమ్మం – ఇల్లెందు మార్గంలో రైల్వేలైన్‌పై ఆర్‌ఓబీ లేదా అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని, గ్రామాల్లో అవసరమైన చోట నూతన విద్యుత్ స్తంభాలు వేయాలని తెలిపారు.

రోడ్లు ఇంత అధ్వానమా?

జిల్లాలోని కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, తల్లాడ, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయని వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్, రాగమయి ప్రస్తావించారు. నిత్యం తాము ఈ రహదారులపైనే ప్రయాణిస్తున్నామని తెలిపారు. అయితే, గుంతలు తేలి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ప్యాచ్‌వర్క్‌లకే పరిమితం కావడాన్ని వారు తప్పుపట్టారు.

జాతీయ రహదారిపై మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డుపై గుంతల్లో తారు నింపుతున్న కూలీలు

కొణిజర్ల: జిల్లాలోని పలుచోట్ల రహదారులు దెబ్బతిన్న అంశంపై 'అడుగడుగునా గుంత..' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల శాఖ అధికా రులు స్పందించారు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి పల్లిపాడు వరకు రహదారిపై ఏర్పడిన గుంతల్లో తారు పోసి తాత్కాలికంగా మరమ్మతు పనులు ప్రారంభించారు. 'సాక్షి' కథనంతో అధికారుల్లో కదలిక వచ్చి తాత్కాలికంగానైనా రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

బస్టాండ్లలో షాపుల కేటాయింపునకు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ బస్టాండ్లలోని షాపులను అద్దెకు కేటాయించేలా టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ ఆర్‌ఎం జీ.ఎస్.పవిత్ర తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలోని బస్టాండ్లలో షాపుల కోసం ఆసక్తి ఉన్న వారు నవంబర్ 6వ తేదీలోపు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. పూర్తి వివరాలకోసం కోసం 99635 07506 నంబర్‌లో సంప్రదించాలని ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని అశ్వారావుపేట, వీఎం బంజర బస్టాండ్లలోని నాలుగు చొప్పున షాపులకు నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని డీఎం యు.రాజ్యలక్ష్మి మరో ప్రకటనలో తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో జైలుశిక్ష

ఖమ్మంలీగల్: తీసుకున్న అప్పు తీర్చే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో సదరు వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు నష్టపరిహారం కింద ఫిర్యాదికి రూ.3 లక్షలు చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ఎస్పీ ఆఫీస్ రోడ్డు ప్రాంతానికి చెందిన పాగా బాబులు వద్ద రాపర్తినగర్‌కు చెందిన బ్రహ్మదేవర సోమయ్య 2018 జూన్ 22న రూ.2.90 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం నగదు చెల్లించాలని బాబులు సూచించగా 2019 డిసెంబర్ 21న రూ.2.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. అయితే, ఈ చెక్కును బ్యాంక్ ఖాతాలో జమ చేస్తే సోమయ్య ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో బాబులు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు విచారణ అనంతరం సోమయ్యకు జైలుశిక్ష విధించడంతో పాటు రూ.3లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు


వెంకటేశ్వరరావు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడుకు చెందిన గంతాల వెంకటేశ్వరరావు(30) కట్లేరు చెక్‌డ్యాం వద్ద చేపలు వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆయన వేటకు వెళ్లిన ప్రదేశం వద్ద లోతుగా, ప్రవాహం ఉండటంతో గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై అందిన సమాచారంతో పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు గాలిస్తున్నారని ఎస్సై పి.వెంకటేశ్ తెలిపారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

కూసుమంచి: మండలంలోని గంగబండతండాకు చెందిన డిగ్రీ విద్యార్థిని వడిత్య చైతన్య (19) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఆమె ఉరి వేసుకుని ఉండడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న చైతన్య దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. అయితే, తిరిగి కళాశాల ప్రారంభమైనా ఇంటి వద్దే ఉండడంతో తల్లిదండ్రులు వెళ్లాలని మందలించగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

నిజామాబాద్ జిల్లాలో తల్లాడ మండల వాసి మృతి

మోర్తాడ్: కూలీ పని కోసం వచ్చిన ఓ వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడిమకు చెందిన కాకర్ల గోవింద్(54) బతుకు దెరువు నిమిత్తం మోర్తాడ్‌కు సోమవారం రాత్రి భార్యతో కలిసి బస్సులో వచ్చాడు. భార్యను ఓ చెట్టు కింద ఉంచి బయటకు వెళ్లిన గోవింద్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయనను ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, భర్త మృతదేహం వద్ద భార్య లక్ష్మి దీనంగా కూర్చోవడం అందరినీ కలిచివేసింది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
మొక్కజొన్న	2,250	2,250
పెసలు	7,100	4,200
మిర్చి	17,500	8,500
మిర్చి తాలు	9,000	8,900
ఏసీ మిర్చి	19,000	9,500
ఏసీ తాలు	8,200	8,200
కొత్త పత్తి	7,000	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043

ప్రజల స్థితిగతులు, అభివృద్ధిపై ఆరా

- జిల్లాలో కేంద్రప్రభుత్వ ట్రెయినీ అధికారుల పర్యటన
- నాలుగు గ్రామాల్లో కొనసాగుతున్న పరిశీలన



కామేపల్లి : జగన్నాథతండాలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: గ్రామీణ ప్రజాంతాల్లో ప్రజల జీవన స్థితిగతులు, ఉపాధి, ఆదాయంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న అభివృద్ధిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్‌కు చెందిన ట్రెయినీ అధికారులు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. బృందాలుగా విడిపోయిన అధికారులు నాలుగు గ్రామాలకు చేరుకోగా మూడు రోజుల పాటు పరిశీలించనున్నారు. ఇందులో భాగంగా ఏన్కూరు మండలం లచ్చగూడెంలో అధికారులు మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రంతో పాటు నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారం, బోధన, వైద్యసేవలతో పాటు నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలు తెలుసుకున్నారు. ఈ బృందంలో ట్రెయినీ అధికారులు అల్తాఫ్ మహమ్మద్, అంకిత్ యాదవ్, ఈషాన్‌గుప్తా శుభం, పంకజ్‌కుమార్ మీనాతో పాటు తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

■ తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్‌తండాలో ట్రెయినీ అధికారులు రూపేష్ జహవాల్, తరుణ్‌పాండ్యా, సుమిత్ గోవింద్‌బాయ్ మక్‌వానా, అభిషేక్ అండసు, ఉషాయాదవ్, సావంత్ మినాల్ మహాదేవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వన నర్సరీ, డంపింగ్ యార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏఓ సీతారాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


కారేపల్లి : ఆలియాతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో భవనం నమూనాతో ట్రెయినీ అధికారులు

■ కారేపల్లి: మండలంలోని ఆలియాతండాలో ట్రెయినీ అధికారులు తేజస్విని తబాని, అనితావీనా, వైభవ్‌మీనా, అల్తామాష్ ఘాజీ, విపుల్ సింఘాల్ పర్యటించగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. కేంద్రంలో ఆటపాటలతో కూడిన బోధన వివరాలు ఆసక్తిగా తెలుసుకున్నారు. ఆతర్వాత స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై రుణాల ద్వారా ఆర్థికాభివృద్ధిపై ఆరా తీశారు. ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, గ్రామ కార్యదర్శులు నెహ్రూ, సుధీర్ పాల్గొన్నారు.

■ కామేపల్లి: మండలంలోని జగన్నాథతండా గ్రామంలో ట్రెయినీ అధికారులు పంటలను పరిశీలించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలను తెలుసుకున్నారు. ఈ బృందంలో మనీశ్ మీనా, సులేఖ జాగర్వార్, అరుళ్‌సెల్వన్, నీలేశ్, శ్రీకాంత్‌గైక్వాడ్, మధివధాని ఉండగా ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు తీసుకొస్తా

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి


ఆస్పత్రి అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ఖమ్మంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేసిన పలు విభాగాల్లో పరిశీలించిన ఆయన భవనం పైకప్పు కురుస్తోందని తెలియడంతో పైకి వెళ్లి పరిశీలించారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ చాంబర్‌లో వైద్యులతో ఎంపీ సమావేశమయ్యారు. విధాన పరిషత్ నుండి డీఎంఈ పరిధిలోకి వెళ్లినప్పటికీ పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేరని అధికారులు ఆయనకు వివరించారు. దీంతో స్పందించిన ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ అన్ని అంశాలను సీఎం, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని, ఆస్పత్రి అవసరాల కోసం నాలుగు ఫ్రీజర్లు సమకూరుస్తామని తెలిపారు. అలాగే, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఇంజనీర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ మరమ్మతు పనులపై సూచనలు చేశారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఆర్‌ఎంఓలు కళావతిబాయి, రాంబాబు, రాథోడ్ వినాయక్, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చావా శివరామకృష్ణ, మిక్కిలినేని నరేందర్, ఇమామ్, దుంపల రవి, రామకృష్ణారెడ్డి, శ్రీకళ పాల్గొన్నారు.

మళ్లీ ఎదుళ్ల చెరువు సర్వే


పత్తి చేను మధ్యలో హద్దులు నిర్ధారిస్తున్న అధికారులు

తల్లాడ: తల్లాడకు ఆనుకుని ఉన్న ఎదుళ్ల చెరువు శిఖం భూమి నిర్ధారణకు అధికారులు మంగళవారం రెండోసారి సర్వే చేపట్టారు. 757 సర్వే నంబర్‌లోని 113 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు కింద 140 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, వరంగల్–దేవరపల్లి జాతీయ రహదారి పక్కన, తల్లాడ బస్టాండ్‌ను ఆనుకుని శిఖం భూములు ఉండడంతో రూ.కోట్లలో ధర పలుకుతుండగా పలువురు ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా గతనెల 19న అధికారులు సర్వే చేశారు. అయితే, చెరువు నిండా నీరు ఉండడం, శిఖం భూమిలో పంటలు సాగవుతుండడంతో అప్పుడు సర్వేకు వీలు కాలేదు. ఈ నేపథ్యాన మంగళవారం మరోమారు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ధర్మారావు ఆధ్వర్యాన జల వనరులు, రెవెన్యూ శాఖ ఉద్యోగులు శాటిలైట్ సర్వే చేశారు. సాయంత్రానికి 80 శాతం మేర పూర్తయినా, అంతలోనే వర్షం పడడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. సర్వేలో జలవనరుల శాఖ డీఈఈ శ్రీనువాసరావు, ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ భాస్కర్, సర్వేయర్ భరత్ పాల్గొన్నారు.

డీసీసీబీ పరిధిలో రూ.250కోట్ల రుణాలు


రైతులకు రుణాలు అందిస్తున్న సీఈఓ వసంతరావు

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలో రూ.250 కోట్ల మేర రుణాలు పంపిణీ చేసినట్లు సీఈఓ వి.వసంతరావు తెలిపారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి పీఏసీఎస్‌లో మంగళవారం నూతన సభ్యులకు రుణాలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న డీసీసీబీ ద్వారా దాదాపు 70 వేల మంది రైతులకు రూ.250 కోట్ల మేర రుణాలు అందించినట్లు తెలిపారు. అలాగే, రైతుల సేవలను మరింత చేరువ చేసేలా చెరువుమాధారం(నేలకొండపల్లి), కందుకూరు (వేంసూరు), కరుణగిరి(ఖమ్మం రూరల్)ల్లో కొత్తగా బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ నాగప్రసాద్, సొసైటీ వైస్‌చైర్మన్ కల్ల కుంట్ల శ్రీను, పాలకవర్గ సభ్యులు విజయభాస్కర్, భాస్కర్‌రెడ్డి, వెంకట్రామయ్య, బాలాజీ, శ్రీను, నాగేశ్వరరావు, సామేల్, సీఈఓ జగదీష్‌తో పాటు వీరస్వామి, రాంబాబు, ప్రవీణ్, అనుసూయ పాల్గొన్నారు.

సురక్షితంగా దీపావళి జరుపుకునేలా చర్యలు

ఖమ్మంసహకారనగర్: జిల్లా ప్రజలు సురక్షితంగా, ఆనందకరమైన వాతావరణంలో దీపావళి పండుగ జరుపుకునేలా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె అధికారులతో బాణాసంచా షాపుల ఏర్పాటు విషయమై సమీక్షించారు. పోలీస్, ఫైర్, మునిసిపల్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు. ఖమ్మంతో పాటు ఇతర ప్రాంతాల్లో బాణాసంచా షాపుల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయాలని, షాపుల ఏర్పాటులో నిబంధనలు పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదాలు, ఇతర ఘటనలపై ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఎస్సీఎసీపీ సాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్‌కుమార్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన తోటల రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంవ్యవసాయం: పండ్ల తోటలతో పాటు మిరప, ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ సూచించారు. మామిడి, జామ, సీతా ఫలం, అరటి, నిమ్మ, బొప్పాయి తదితర తోటల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మిరప రైతులు తెగుళ్ల నుంచి కాపాడుకునేలా ఉద్యానవన శాఖ అందించిన మెళకువలు పాటించాలని, కొమ్మ ఎండుకాయ కుళ్లు తెగులు నుంచి రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, ఆయిల్‌పామ్ మొక్కల ఎదుగుదలకు సూక్ష్మ స్థూల పోషకాలను అందించాలని, కొత్త తోటల్లో మొక్కలు నాటిన మూడు నెలల తర్వాతే ఎరువులు వేయాలని తెలిపారు. కాగా, ఆయిల్‌పామ్‌లో కాండం తడి తెగులును గుర్తిస్తే కాండం శస్త్ర చికిత్స చేయాలని సూచించారు.

పిడుగుపాటుతో తండ్రీకుమార్తె మృతి

- మృతుడి భార్యకు తీవ్రగాయాలు
- పత్తి చేనులో పనికి వెళ్లిన సమయాన ఘటన


లింగస్వామి (ఫైల్)


కావేరి (ఫైల్)

కామేపల్లి: పత్తి ఏరేందుకు వెళ్లిన తండ్రీకుమార్తె పిడుగుపాటుతో మృతి చెందగా మృతుడి భార్య తీవ్ర అస్వస్థతకు గురైంది. కామేపల్లి మండలం మద్దులపల్లిలో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మద్దులపల్లికి చెందిన చింతల లింగస్వామి(38)– శైలజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె కావేరి(19) కారేపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె ఇంకా వెళ్లలేదు. ఈక్రమంలో తమ చేనులో పత్తి ఏరేందుకు తల్లిదండ్రులతో కలిసి కావేరి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా అందరూ చేను సమీపాన చెట్టు కిందకు చేరారు. ఈక్రమంలోనే వర్షం పెరిగి చెట్టుపై పిడుగుపడటంతో షాక్‌కు గురైన లింగస్వామి, కావేరి అక్కడికక్కడే మృతి చెందగా శైలజకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సహచర రైతులు, కూలీలు ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన రెవెన్యూ, పోలీసు అధికారులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, దసరా సెలవులకు ఇంటికి వచ్చిన కావేరి తల్లిదండ్రులకు సాయంగా వెళ్లి మృత్యువాత పడడం, ఆమె తండ్రి కూడా మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

ఫోన్ ధరతో పాటు పరిహారం, ఖర్చులు చెల్లించండి

ఖమ్మం లీగల్: అమెజాన్‌లో ఫోన్ ధర చెల్లించి బుక్ చేసుకుంటే డెలివరీ చేయకపోగా సరైన సమాధానం రాకపోవడంతో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఆయనకు అనుకూలంగా ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత తీర్పు ఇచ్చారు. ఖమ్మంకు చెందిన జి.కృష్ణారెడ్డి 28 మార్చి 2023న రూ.29,999 చెల్లించి అమెజాన్‌లో ఫోన్ బుక్ చేసుకున్నాడు. ఆయనకు 5 ఏప్రిల్ 2023న ఫోన్ డెలివరీ చేసినట్లు మెసేజ్ అందినా ఫోన్ చేరలేదు. ఈ విషయమై సంస్థకు ఫోన్ చేసినా స్పందన రాకపోవడంతో ఆయన వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో విచారణ అనంతరం ఫోన్ నగదు రూ.29,999తో పాటు నష్టపరిహారంగా రూ.10వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.10వేలు చెల్లించాలని మంగళవారం తీర్పు చెప్పారు.

పోలీసుల అదుపులో చెన్నారం దంపతులు?

- చోరీ కేసుల్లో పాత్ర.. బంగారం, నగదు స్వాధీనం

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన దంపతులను సూర్యాపేట జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చెన్నారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన చోరీల్లో నిందితుడిగా ఉన్నాయి. గతంలోనూ ఆయన చోరీ కేసుల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. తాజాగా వారం క్రితం సూర్యాపేట జిల్లా పోలీసులు సదరు వ్యక్తిని ఓ చోరీ కేసులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు విచారించగా చోరీ చేసిన బంగారం, నగదును చెన్నారంలోని తన ఇంట్లో దాచినట్లు చెప్పడంతో మంగళవారం ఇక్కడకు తీసుకొచ్చిన పోలీసులు బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం చోరీ సొత్తుతో పాటు నిందితుడి భార్యను కూడా తీసుకెళ్లారు. ఈ విషయమై సూర్యాపేట జిల్లా పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

లారీని ఢీకొట్టిన అంబులెన్స్

ఆస్పత్రికి వెళ్తున్న వృద్ధురాలు సహా ఆరుగురికి గాయాలు

తల్లాడ: అస్వస్థతకు గురైన వృద్ధురాలిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న అంబులెన్స్ వేగంగా వెళ్లే క్రమాన తల్లాడ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. తిరువూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ తల్లాడ బస్టాండ్ ఎదురుగా డివైడర్ ఎక్కి ఖమ్మం నుంచి తల్లాడ వైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తిరువూరు మండలం మునుకుళ్లకు చెందిన వృద్ధురాలు సీ.హెచ్.కనకమ్మ అస్వస్థతకు గురికావడంతో ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మునుకుళ్లకు చెందిన కనకమ్మతో పాటు ఆర్‌ఎంపీ బి.గోపి, సీ.హెచ్.కృష్ణమ్మ, సీ.హెచ్.కోటయ్య, ఆర్.కృష్ణవేణితో పాటు అంబులెన్స్ డ్రైవర్ ఎన్.ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి, వీరిని తల్లాడ, ఏన్కూరు 108 వాహనాల్లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు చేరుకుని పరిశీలించారు.

ప్రమాదాలకు నిలయం... సాగర్ బ్రిడ్జి


రక్షణ గోడలు కూలిపోవడంతో ప్రమాదకరంగా మారిన సాగర్ ప్రధాన కాల్వపై బ్రిడ్జి


కాల్వలో బోల్తా పడిన ట్రాక్టర్ (ఫైల్)

- పూర్తిగా దెబ్బతిన్న రక్షణ గోడలు
- వెడల్పు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు
- తాజాగా కాల్వలో ట్రాక్టర్ పడి ఇద్దరు మృతి

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్ల నుంచి ఖమ్మం అర్బన్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారి అది.. ఈ మార్గంలోనే బోడియా తండా వద్ద నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ ఉంది. ఇక్కడ రాకపోకలకు కాల్వలు తవ్వించిన సమయాన కల్వర్టుపై నిర్మించిన బ్రిడ్జి శిథిలమై ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా మారింది. నిత్యం వందలాది వాహనాలు వచ్చివెళ్లే ఈ బ్రిడ్జికి రక్షణ గోడలు కూడా ధ్వంసమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పట్టింపులేని తనం విమర్శలకు తావిస్తోంది. ఇదే బ్రిడ్జి పైనుంచి సోమవారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడగా ఇద్దరు మృతి చెందడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు

బోడియా తండా వద్ద ఎన్నెస్పీ కాల్వపై కల్వర్టు బ్రిడ్జి ఇరుకుగా ఉంటుంది. దీంతో కొత్తగా వెళ్లేవారు దగ్గరకు వచ్చేవరకు ఇరుకుగా ఉన్నట్లు కానీ, మూల మలుపు ఉందనే విషయం కానీ గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. సాగర్ కాల్వ ఉందనే విషయం కూడా తెలియకుండా రోడ్డు మూల మలుపు ఉంటుంది. దీనికి తోడు కాల్వ బ్రిడ్జిపై రక్షణ గోడలు పూర్తిగా కూలి పోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే స్థానికులు సైతం జంకుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఇకనైనా అధికారులు స్పందించి మరిన్ని ప్రమాదాలు జరగకముందే కాల్వపై మరింత వెడల్పుతో కొత్త బ్రిడ్జి నిర్మించాలని, ఆలోగా ప్రస్తుత బ్రిడ్జికి రక్షణ గోడలు పునర్నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారింది..



మేం ఏ పనికైనా తనికెళ్లకు ఈ బ్రిడ్జి మీదుగానే వెళ్లాలి. మూలమలుపు ఉండడం, బ్రిడ్జి వెడల్పుగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తరచుగా వాహనాలు ఢీకొని పలువురు గాయపడుతున్నారు. ఇకనైనా బ్రిడ్జికి రక్షణ గోడలు పటిష్టం చేయాలి.

– వడిత్యా జాను, బోడియాతండా

వెడల్పుగా కొత్త బ్రిడ్జి నిర్మించాలి



సాగర్ కాల్వపై నిర్మించిన బ్రిడ్జి మీదుగా పది గ్రామాల ప్రజలు వచ్చివెళ్తుంటారు. బ్రిడ్జి పాతది కావడంతో శిథిలావస్థకు చేరింది. మరింత వెడల్పుతో కొత్త బ్రిడ్జిని నిర్మించి ప్రమాదాలు అరికట్టడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– అజ్మీరా బాలకృష్ణ, అన్నవరం